

## క్రోతి క్రోతి

ఒక కోతిపిల్ల తప్పిపోయి వచ్చి, మార్కెట్లో భయపడుతూ కిచకిచలాడు అందరి వంకా చూస్తూ, యెవరన్నా దయ తలుస్తారేమోనన్నట్లు దుస్తుల చివరలు లాగి వదిలేస్తూ రుక్మిణి కంటబడింది. రుక్మిణి పల్లెవాటు అంచులు పట్టుకు లాగింది. రుక్మిణి జాలిపడి, కోతిపిల్లను యెత్తి కూరలకోసం తెచ్చిన పెద్ద సంచీలో కూచోబెట్టింది. అరిటి పండుకొని యిచ్చింది. కూరలు కొని వేరే సంచీలో వేసి, రెండు సంచులతో యింటికి వచ్చింది. కూరల సంచీ కిచెన్ వాకిలి వద్ద వదిలింది. కోతిపిల్లను సంచినుండి తీసి తాడు కట్టి స్తంభానికి కట్టింది వరండాలో. చిలకడ దుంపలు రెండు, అరటిపళ్లు రెండు దగ్గరుంచింది. మంచి నీళ్ల గిన్నె. అదే మొదలు. కోతి చేష్టలు, దాని అరుపులు ఎంజాయ్ చేయటం.

వూరగాయకి సువర్ణరేఖ కొనితేవాలని తండ్రి పున్నయ్య మామిడి తోపులవేపు వెళ్తూ కూతురు రుక్మిణి బుట్ట పట్టుకుంటుందని వెంటబెట్టుకెళ్లాడు. తండ్రి బేరం చేసి, కాయలెన్నుతుంటే రుక్మిణి, రెక్కలు సరిగారాని చిలకపిల్ల గూటినించి కిందబడి యెగిరిపారిపోవటం రాక, అరుస్తుంటే చూసింది. రుక్మిణి ఆ చిలక పిల్లను తన వల్లెవాటులో దాచి పెట్టుకుని, మామిడి కాయల సంచీ కుడిచేత్తో పట్టుకుని తండ్రితో యింటికి వచ్చింది. తండ్రేమో మామిడికాయలు నేలమీద పరుస్తూ భార్యను పిలిచాడు '' మంచివి పలకబారి పక్వాని కొచ్చినవి తెచ్చాను. కొసరు అయిదు వేశాడు కాపలావాడు. నీకు నచ్చిన వూరగాయలు పెట్టుకోవచ్చు. కడిగి తుడిచి తొడిమ తరిగి తుడిచి చాపమీదుంచు. మామిడి కాయలు ముక్కలు చేసే కత్తి పీటతుడిచి లెస్తా. చెక్క తీసేందుకు ఆలిచిప్పలు తెచ్చా. తురిమేందుకు, కోరేందుకు యంత్రాలు తెచ్చా. అన్నీ చేసిపెడతా'' అంటున్నాడు. రుక్మిణి పంజరంలో మెత్తని పక్క వేసి చిలకపిల్ల నందులో వుంచి పంజరం వేలాడదీసింది.

రోజులు దొర్లి చిలక, జామ, చిలకడ దుంప ముక్కలు, దొండ పళ్లు, సపోటా తొనలు తిని బలిసింది. రుక్మిణీ దేవేమో తన పెంపుడు చిలకకు ''కృష్ణా! కృష్ణా!'' అనటం నేర్పిందని భాగవతంలో వున్నది. ఈ రుక్మిణి ''క్రోతి! క్రోతి!'' అనటం నేర్పింది, తన రామచిలకకు. తల్లీ దండ్రీ నవ్వారు చిలక పలుకులు విని, ''అదేం పనే రుక్కూ? రామా! కృష్ణా!'' అని నేర్పవేం?''

''మనలో కోతి వున్నది. అది మనల్ని ఆడిస్తున్నది. గుర్తు చేస్తుందని అలానేర్పా నాన్నా. బయటి కోతి మనకు నవ్వు తెప్పిస్తుంది. లోపలికోతి మనల్ని చూసి బయటివారు నవ్వే పన్లు మనచేత చేయిస్తుంది, నవ్వేమాటలు పలికిస్తుంది''. అంటుంటే తల్లి అనుమాయమ్మ వంటింట్లోకి వెళ్లి ''యేదో మాడిన వాసన'' అని చూస్తోంది.

తండ్రి హనుమంతయ్య అక్కడే నిలబడి, ''అది నిజమే. ఒక్కోసారి నా ధర్మపత్ని అచ్చం కోతిలాగే కనిపిస్తుంది. కళ్లార్పుతూ తిట్టుతూ చేతులు తిప్పుతూ పీకటానికి మీదిమీదికొస్తుంది. మందలించినా, వారించినా, తప్పు చూపినా, కోతి చెట్టు మీద గెంతుతూ వెళ్లినట్లు వూళ్లమీద వూరేగటానికి వెళ్తుంది'' అని నవ్వుతూ అప్రయత్నంగా ''క్రోతి'' అన్నాడు.

2

సంతకెళ్లి పళ్లు, కూరలు కొని సంచీలు నింపి, రెండు చేతులతో పట్టుకుని బస్ స్టాప్‌కి వచ్చి, తన నంబరు బస్సుకోసం యెదురుచూస్తున్నది రుక్మిణి. ఒక పేదపిల్లాడు పంజరం పట్టుకుని వచ్చాడు. పంజరంలో మైనా వున్నది. కొనమని అడుగుతూ పంజరమెత్తి చూపాడు.

రుక్మిణిని మైనా కన్న పిల్లవాడే బాగా ఆకర్షించాడు. వాని ఆకారం జాలి గొలిపింది. తలకు నూనె లేక పేనుకుపోయి రాగిరంగుకి తిరిగింది. నకనకలాడుతున్న పొట్టా, చింకి చొక్కా చింకిలాగూ, యెండిన పెదవులు, కళ్లలో ఆశ. రుక్మిణి వాడిని తన వెంట రమ్మని, లస్సీ తాగించింది. పకోడీలు వందగ్రాములు, బోండాలు, ఒక సమోసా విస్తట్లో పెట్టి యిమ్మన్నది. అమ్మే

వాడలాగే యిచ్చి మంచి నీళ్ల గ్లాసూ యిచ్చాడు. పంజరం కింద వుంచి పిల్లాడు అవురావుర్న తిని, నీళ్లు గటగటా తాగి గ్లాసు కింద వుంచాడు, రుక్మిణి సంచీలు కాళ్లకానించుకుని పర్స్ నించి డబ్బు తీసి చెల్లించింది. పిల్లవాడు పంజరం అందుకుని నిలబడి చూస్తున్నాడు. వాడికి నూరునోటు అందించింది. స్వర్గానికి మెట్టెక్కుతున్నట్టు చూసి '' ఆటో పిలవనా అమ్మా? ఆ సంచీలు నేపట్టుకుంటా. అదుగో ఆటో బేరమాడుకోండి'' అని సంచీలు పట్టుకున్నాడు. ''తప్పిపోయిన బిడ్డేమో. యెవరూ దగ్గర్లేరే'' అనుకుంటూ యెక్కడికెళ్లాలో చెప్పి ఆటోవాలాతో బేరం సెటిల్ చేసి ఆటో యెక్కింది రుక్మిణి. పిల్లాడు సంచీలు ఆటోలో వుంచాడు. నోటు యిచ్చేస్తూ, పంజరం భద్రంగా రుక్మిణి పక్కనుంచాడు. దణ్ణం పెట్టి ''చిల్లర లేదు'' అన్నాడు. రుక్మిణి నోటు తీసుకోలేదు. ''అక్కర్లా'' అన్నది. ''నేనూ రానా అమ్మా!'' అన్నాడు. కళ్లలో గంపెడాశ. మొహాన నవ్వు. ''రా'' అన్నది రుక్మిణి. సైకిల్ మీద అమ్మే చౌక దుస్తులూ చూపితే ''పో. కొనుక్కో'' అన్నది రుక్మిణి. చారల నిక్కరు. మంచి చొక్కా కొని అక్కడే ధరించి వచ్చాడు. ఆటో వాలా చోటు చూపగా వాని పక్కన కూచున్నాడు పిల్లాడు.

3

ఇంట్లో అడుగుంచింది రుక్మిణి, సంచీలు పట్టుకుని పిల్లాడు, రుక్మిణి చేతిలో పంజరం. దానిలో మైనా.

''వీడెవడే రుక్కూ? మతిపోయిందా?'' అని తల్లి అనుమాయమ్మ నోటిమీద చెయ్యేసుకుంటే, అక్క వాసంతి, ''జీతమెంతరా థగ్గూ? మీరు గోండులా పిండారీలా? రుక్కుకి నీ భాష అర్థమైందీ? మైనాని కొన్నట్టే నిన్నూ కొన్నదా?'' అని పకపకా నవ్వింది.

రుక్మిణి సంచీలందుకుని వంటింటికివతులుంచి వచ్చి, ఆటో బాడుగ చెల్లించి వాడిని పంపి వచ్చి మైనా పంజరం అందుకుని వరండాలో బల్లమీద కెక్కి సీలింగ్‌కి వున్న వంకెతాకించే యినప దానికి తగిలించి దిగి వచ్చింది.

''మూడు పూటలా మేపాలా? పిక్‌పాకెట్టేమో, నమ్మి తెచ్చేశావే? నా

సంగతి తెలుసా వీడికి చెప్పావా?'' అన్నాడన్న మారుతీరావ్.

''అన్నిటికీ భయపడతారు. అందర్నీ అనుమానిస్తారేం? కొళాయినించి నీళ్లు తెచ్చిపెడతాడు. వంతుల వారీగా పట్టాలి. మొక్కలకు నీళ్లు పోస్తాడు. సరుకులు తెస్తాడు స్టోర్‌నించి, సూపర్ బజార్నించీ. అన్నం నే వండుతాలే. చల్లాన్నమే. వాడికి ఆ చల్లాన్నమూ లేదేమో. చూశారుగా అవతారం. మైనా వెలబెట్టి ఆ చొక్కా లాగూ కొనుక్కున్నాడు. నువ్వు వండినవే తింటున్నారా అమ్మా? యెవరిక్కావాల్సినవి వారు వండుకు తింటున్నారు. యెవరినీ వారించవే? మనింటికి వచ్చి పోయే జనులున్నారు. ''జేబుదొంగలున్నారు జాగ్రత్త'' అనే బల్ల కడితే సమంజసంగా వుంటుందని నా అభిప్రాయం. వాడు జేబుదొంగ అని ఋజువైననాడు దగ్గరుండే పనిచేయిస్తాలే'' అన్నది రుక్మిణి. పిల్లవాడిని వీధిలోంచి దొడ్డివేపు తీసికెళ్లి రెండు గదుల సర్వెంట్ క్వార్టర్సు చూపి ''అందులో వుండు. పనినేర్పుతా'' అన్నది. తాను తన స్నానాల గదివేపు వెళ్లింది రుక్మిణి.

ఒకళ్లనొకళ్లు చూసుకున్నారక్కడున్నవారు.

''నా పిన్నమ్మ సోమమ్మ, తన మొగుడు మిగిల్చి భృతికింద యిచ్చిన రెండెకరాలూ, పెంకుటిల్లు యిస్తే, యీ రుక్కు కూతురు పిన్నమ్మ సోమమ్మకు పక్షవాతమొచ్చి మంచాన బడితే సకలోపచారాలు, స్నానం, పానం చూసి అవసాన దశవరకు కనిబెట్టుకుని వున్నదని తనకు చెందినవి దీని పేర పెట్టిమరీ చచ్చింది. నా కివ్వచ్చుగా? ఓ రోజున ఆ పొలం యిల్లూ యీ రుక్కుచేత అమ్మించకపోతే చూస్కో'' అని నల్లని పీల పెదిమల మధ్యగా గొణుగుతూ ఛాలెంజ్ చేసింది అనుమాయమ్మ. మనసులోనే మీసం మెలేసి తొడ చరిచింది. ''కోతి మొహం'' అంటున్నది. పంజరంలో చిలక ''క్రోతి! క్రోతి!'' అని అరిచి, కడ్డీ మీద నించి పంజరం చువ్వల మీదెకి దిగి దొండపండు తింటూ కళ్లార్పింది. కోతిపిల్ల అటక మీదినించి ఒక్క వుదుటున అనుమాయమ్మ నెత్తిమీద దూకింది. అనుమాయమ్మ దాన్ని లాగి కిందబడేసి కర్ర తెచ్చేలోపల కోతి గెంతి పారిపోయింది.

4

పిల్లాడికి ''రాంబంటు'' అని తండ్రి పేరుపెట్టాడు. రుక్మిణి నవ్వింది. వాడి యీడుకి వాడు చేయగలిగిన పన్లన్నీ చేస్తున్నాడు రాం. తనకిచ్చిన గదిలో పడుకుంటాడు. రుక్మిణి యిచ్చిన పాత రగ్గు కప్పుకుంటాడు. నులక మంచమిచ్చాడు హనుమంతయ్య వాడికి పోషణ చేస్తూ మేనర్సు నేర్పింది రుక్మిణి.

రుక్మిణి రెండవ పెత్తల్లి రామక్క కోర్టు పని మీద చెల్లి అనుమాయమ్మయింటికి వచ్చింది. ''కలయ యశోదే తవ బాలం'' అన్నట్లు యిల్లంతా కలయతిరుగుచూ చూసింది రామక్క. చురుకుగా ఒకబ్బాయి పన్లు అందుకుంటూ, పన్లు చేస్తున్నాడు. పేరడిగితే రాంబంటు అన్నాడు. చువ్వలాగా వున్నాడు ''రాం'' అనే కేక వినబడగానే కేక వచ్చిన వేపు పరుగుతీస్తాడు.

''వీడెవరే అనూ? రోడ్డు పక్కన పూసలు, పూసల పేరులు – తావళాలు పంచి, అల్లుతూ కనిపిస్తారు, వాళ్లబ్బాయా. రుక్కు వీడిని దత్తు చేసుకున్నదా? సగోత్రీకుడా? తన ఆస్తి వీడికిస్తుందా? చదువు గూడా చెప్పిస్తున్నదా? సంబంధాలు తిప్పేస్తున్నదని చెప్పుకుంటున్నారు. వీడిని పెళ్లాడుతుందా సినిమాలోలాగా'' అలా నోటికి స్వేచ్ఛ యిచ్చి రవిక విప్పి దొడ్లో దోపుకుని, చీరకొంగు ముడివిప్పి పసుపు పొట్లం కుంకుమ పొట్లం తీసుకుని, ''స్నానం చేస్తా'' నంటూ దొడ్డివేపు వెళ్తుంటే, చెల్లి అనుమాయమ్మ, ''అక్కా. వేడి నీళ్లు స్నానానికి రా'' అని స్నానాల గదివేపు తీసికెళ్లింది.

చిలక ''క్రోతి క్రోతి'' అని అరిస్తే, కోతి పిల్ల కిచ కిచలాడుతూ రామక్క బుజం మీద దూకింది. రామక్క నెట్టి కిందబడేస్తే, ఆమె వదిలిన చేతి సంచీ కోతి కంటబడింది. దాన్ని అందుకుని తలుపుమీదకి గెంతి అటకెక్కి అక్కడ పడేసింది. హనుమంతయ్య బాదమాకుల విస్తళ్లతో లోపలికొచ్చాడు. ''మా అబ్బాయి కాంతా వచ్చాడు రుక్కూ అమ్మకు చెప్పు. అత్తెసరెక్కించాలా యెక్కువే వుడకేసిందా అడుగు. నేనట్లా వెళ్లి పాన్‌షాపులో చక్రకేళీ పళ్లు, అమృతపాణీ కొనితెస్తా'' అని వెళ్లాడు.

కాంతా హాలులో పిల్లలు కారమ్స్ ఆడటం చూసి, వచ్చి, బల్ల ముందు కూచున్నాడు. రామాచారి, సీను క్లాసుమేటు, ''యెలా వచ్చారు కాంతారావు గారూ? స్కూటరెత్తుకు పోయిన నేరానికి అరెస్టయి రిమాండులో వున్నారని దినపత్రికలో చూచామే? విడుదలైనారా?'' అన్నాడు. రెడ్ కాయిన్ గురి చూసికొట్టాడు నల్ల కాయిన్‌తో. రెడ్‌కాయిన్ సంచీలో పడింది.

''పొగరెక్కిందా రామిగా? నా పేరు లక్ష్మీకాంతం'' అని నవ్వుతూనే రామాచారి వీపు మీద ఫెడీమని బాది, ''లచ్చాం! మంచి తీర్థం గ్లాసుతో పట్రా. యెండనబడి వచ్చానా'' అని కేకవేస్తే, లక్ష్మి కుమారి అనే చెల్లెలు రుక్కు కన్న యెనిమిదేళ్లు చిన్నది, మంచి నీళ్లగ్లాసు తెచ్చి అందించింది. గ్లాసు పైకెత్తి నీళ్లు గొంతులో పోసుకుంటూ కాంతా, పొరపాటున పడినట్టు గ్లాసు కారంబోర్డు మీద వదిలితే మిగిలిన నీళ్లు బల్లమీద ఒలికినై. బల్ల తడిసింది. లక్ష్మి కుమారి పాతబట్ట పెట్టి తుడిచి గ్లాసు తీసికెళ్లింది. పిల్లలు కాయిన్స్ డబ్బాలో పడేసి బల్ల యెత్తి తీసికెళ్లి బెడ్‌రూమ్‌లో గోడకానించారు. చిలక ''క్రోతి క్రోతి'' అన్నది. యెవరంటున్నారా అని నాల్గువేపులా చూచాడు కాంతా. కోతి వుదుటున వచ్చి నెత్తి నెక్కితే లాగబోయాడు కాంతా. జుట్టు పట్టుకు పీకుతుంటే పిల్లలు చూసి నవ్వు మొహాలతో వెళ్లిపోయారు.

రుక్మిణి పాఠానికెళ్లి వచ్చి కోతిని వదిలించి యెత్తుకెళ్లింది. జామపండు, అరటిపండూ యిచ్చింది కోతికి.

''యెక్కడికెళ్లి వస్తున్నావే రుక్కూ? ఇంట్లో కాలు నిలవదా నీకు?'' అన్నాడు కాంతా.

''కంప్యూటర్ క్లాసకి అటెండై వస్తున్నా'' అన్నది రుక్మిణి కోతి తాను తిన్న పండు తొక్క గురి చూసి కాంత నెత్తిన పడేట్టు విసిరి దూకిపారిపోయింది. దాన్ని పట్టబోయాడు కాంతా.

బాత్ రూమ్‌లో రామక్క, ''నీళ్లేవే అనూ? బాల్చీలో పాళాలు చేసి వుంటాయనుకున్నాను'' అన్నది.

అనుమాయమ్మ కొళాయి తిప్పితే వేడినీళ్లు బాల్చీలో పడసాగాయి. రామక్క తలెత్తి పైకి చూసింది గీసర్ని.

'' ఇవి కొత్తగా వస్తున్నాయి. రుక్కు కొనితెచ్చి పెట్టించింది'' తలుపులు మూసి వీధి వేపు వచ్చింది అనుమాయమ్మ.

వాకిలి ముందు ఆటో ఆగింది. అందునుండి రుక్మిణి చివరి పింతండ్రి ఆంజనేయులు దిగాడు. చేతిలో తాటాకుల బుట్ట. దానిలో విస్తళ్లకట్ట. ధోవతీ షర్టూ, వుత్తరీయం. బాడుగ చెల్లించి పంపేయటానికి పది నిమిషాలు పట్టింది. చెప్పులు వరండాలో వదలి లోపలికొచ్చాడు ఆంజనేయులు. అన్న హనుమంతయ్య, లక్ష్మీకాంతం, వదినా పలకరించారు. ''విస్తళ్లెందుకు బాబాయ్'' లక్ష్మీకాంతం నవ్వుతూ అడిగాడు.

''హనుమంతన్నయ్య యింట్లో అల్యూమినియం కంచాలలో భోంచేస్తారు. సరిగా కడుక్కోరు. విస్తళ్లలో తినరు. పెద్దవాళ్లు గూడా. పుల్లలు గొంతులో అడ్డుపడతాయని జర్మన్ సిల్వర్ కంచాలలోనే తింటారు. నేను యెంగిలిపళ్లెంలో తినను. విస్తళ్లు కొనరని, నేనే తెచ్చా''నని కూర్చుని, ''రుక్కుకి సంబంధం తెచ్చా. మా ఆఫీసరే. మనవాళ్లే. ఇప్పటికి మూడుసార్లు పెళ్లాడాడు. సంతు లేకపోగా, మొదటామె కోర్టుకెక్కి విడాకులు వడేసి లాక్కుంటే, రెండో ఆమె దసరాకు పుట్టింటి కెళ్లి రాలేదు. వెళ్లి తేవాలేమోనని వెళ్తే, '' ఇక్కడే బాగుంది '' అని రాలేదు. మూడో ఆమె మతిభ్రష్టు, యిల్లో కొలిక్కి తెస్తుంది. పెళ్లిలో పెళ్లికూతుర్ని మార్చారని చూసుకోలేదట. ఇంకా చేస్తే నలభై లేవు. పెద్ద డిగ్రీ ఆస్తీ వుద్యోగం వున్నాయి. ఆశ వదలక నన్ను సంప్రదిస్తే, రుక్కు గుర్తు వచ్చింది. ''పిల్లనిప్పిస్తారండి'' అని బయలుదేరదీసి శలవు పడేయించి వెంటబెట్టుకొచ్చా'' అంటున్నాడు మరిది ఆంజనేయులు. చాలా యెరుపు. బొద్దుగా వుంటాడు. ముక్కు పొడుగు. నల్లని జుత్తు.

స్నానం కానిచ్చి తలకు పిడప వేసుకుని మొహాన చిన్న కుంకుమబొట్టు పెట్టుకుని వింటూ వచ్చి నిలబడింది. ''యేడీ వరుడు మరిది గారూ?

వెంటబెట్టుకొచ్చానంటుంటిరే'' అన్నది నవ్వుతూ కదుల్తూ వుంటుంది. పిల్ల వివరాలు తెలుసుకోకుండానే వచ్చేశాడు యిప్పిస్తాననగానే. మా రుక్కు లా మారేజి చేసుకుంటుంది. సూటర్సూ, బాయ్ ఫ్రెండ్సూ వున్నారు దానికి'' అన్నది వదినగారు రామక్క వంకచూస్తూ ఆంజనేయులు, '' ఆఫీసరా? బంధువులింట్లో దిగాడు దోవలో. భోజనం వేళ గదూ భోజనం చేయమని బలవంతం చేస్తారేమోనని రాలేదు. కతికితే అతకదని నమ్మకం. అడ్రసిచ్చా సాయంత్రం అయిదింటికి వస్తాడు పిల్లను చూడటానికి. రాకపోతే నేనే వెళ్లి తెస్తా''. కోతి వచ్చి బుట్ట లాక్కుపోయింది. రామక్క నవ్వుతూ ''అంత నమ్మకం గలవాడు మూడో పెళ్లెలా ఆడాడూ? ముక్క చెక్క లౌతుందంటారే'' అన్నది వూగుతూ.

కాంతా కలగజేసుకుని, ''రుక్కును గురించి నువ్వు విని వుండలేదేమో బాబాయ్. వినివుంటే మాటిస్తావా? యేదో సాగుతున్నట్టున్నది. పెళ్లాడుతుందా? మోడరన్ చదువు. మోపెడ్ కొనిపెట్టాడో ముస్లిమ్. జాబ్ సిద్ధం చేశాడో పంజాబీ'' అంటున్నాడు. చిలక ''క్రోతి క్రోతి'' అని అరిచింది. మైనా చెవులు గింగురుమనేట్టు యీలవేసి, ''రాం. రాం'' అన్నది. ఆంజనేయులన్నివేపులా చూసి, పక్కకు చూసి ''యేదీ నా బుట్ట'' అని అడుగుతూ అందరివంకా చూశాడు.

అన్నా వదినా నవ్వితే, వదిన అనుమాయమ్మ, ''స్నానం చేసిరా మరిదీ. స్నానాల గదిలో వేడినీళ్లున్నాయి'' అన్నది. ''బుట్ట రుక్కు పెంపుడు కోతి లాక్కెళ్లింది. కోతి చేష్టలు'' అని నవ్వింది.

''నా అంగోస్త్రం పైబట్టా అందులో వున్నాయి. వాటి మీద విస్తళ్ల కట్ట వున్నది. '' ఆంజనేయులు సంశయించాడు. రామక్క హాస్యమాడింది'' తలుపులు బిగించుకుని స్నానం చేసి రావచ్చు మరిదీ'' తన సంచీ కోసం చూస్తే అదీ కనబడలేదు. ''నా సంచీ యేదీ?'' అని నాలుగు వేపులా తిరిగింది రామక్క. కనబడలేదు సంచీ. ''అందులో దావా కాగితాలున్నాయి. డబ్బున్నది. దాని బావగారు దగా చేస్తే నా కూతురుకి రావాల్సిన వాటా కోసం

దావాలాడుతున్నాను''. హనుమంతయ్య తమ్ముని వంక మెప్పుగా చూస్తుంటే ఆంజనేయులు, ''లోకులు పలుగాకులని, వారి కూతలు ఖాతరు చేయడు మా ఆఫీసరు. పిల్ల జాబ్ చేసుకుంటానన్నా వద్దనడు. పిల్లవంటి మీదేం బంగారం పెట్టక్కర్లేదు. పెళ్ళి చూపులనేదీ వేడుకకే. అదీ అనవసరమన్నాడాఫీసరు. ఆస్తికి వారసుడు, వంశోద్ధారకుడూ కంటబడాలి అదీ ఆశయం. పెళ్లి చేసి పంపేయటమే''. బావ హనుమంతయ్య తలవూపుతుంటే చూసి నవ్వుతూ రామక్క వచ్చి నిలబడి ''నీ తలవూపటానికర్ధమేమిటి బావా? మెప్పా, యిష్టతా? చూతాంలే అనా?'' అని మరిదిని చూసి, ''మగబిడ్డ నాడబిడ్డగా వేషం వేసిచ్చినా చేసేసుకుని తీసికెళ్తాడా ఆ ఆఫీసరు'' అని నవ్వింది. చిలక ''క్రోతి, క్రోతి'' అంటే ''యెవరు? నేనా? తమ్ముడా? ఆఫీసరా? నామరదలు రామక్కా'' అన్నాడు హనుమంతయ్య నవ్వుతూ!

2

రుక్మిణి మొదటిసారి జీతం అందుకుని ఫస్టుతారీకెంత ఆనందమిస్తుందో, జాబ్ అనేది యెంత రిలీఫ్ యిస్తుందో అనుకుంటూ నవ్వు మొహంతో ఇంటికి వచ్చింది. రాంబంటు యెదురు రాలేదు సరిగదా యింట్లో పన్లు చేసుకుంటూ కంటబడలేదు. నిదానంగా పన్లు చేసుకుంటూ చూస్తే మైనా పంజరం తలుపు తీసివున్నది. పంజరం బోసిగా వున్నది. చిలకపంజరం వేపు వెళ్తే దాని తలుపూ తీసే వున్నదిగానీ, చిలక అడ్డ కడ్డీ మీద ఆడుతూ కనిపించక, కింది తీగల మీద పడివున్నది. రుక్మిణి కూరలు విడదీసి షెల్ఫులో సర్ది, జామపండు అందుకున్నది.

రెడీమేడ్ గుడ్డలున్న పెట్టెలు బెడ్‌రూమ్‌లో బల్లమీదుంచుతుండగా, పార్కులో ఆడుకోటానికెళ్లి వచ్చిన పిల్లలు లోపలికొచ్చారు. పొద్దూక వచ్చింది. పిల్లలు బిక్కమొహాలు పెట్టి చూశారు. యేమీ చెప్పలేకపోయారు. రుక్మిణి అడగలేదు. పంజరం వేపు వెళ్లారు పిల్లలు, రుక్మిణి. ప్రాణమున్నట్టు పొట్ట యెగరేస్తున్నది చిలక. దాన్ని భద్రంగా యెత్తి రుమాలులో చుట్టి గుండెలకానించుకుని పక్షుల డాక్టరు పావన సర్జరీకెళ్లింది రుక్కు.

మరునాడు చిలక కోలుకుని పంజరంలో కడ్డీ మీద యిటూ అటూ తిరుగుతూ కళ్లార్పుతూ రుక్మిణి కానందం కలిగించింది. జామ ముక్కలు, దొండపండు ముక్కలు, సపోటా కడ్డీకి కిందిగా పళ్లెంలో వుంచింది రుక్మిణి. చిన్న గిన్నెలో నీళ్లు పోసి వుంచింది. తలుపుకి తాళం వేసింది. పంజరం కింద నేలమీద అల్యూమినియం పళ్లెముంచింది. కొత్తగా పెంచుతున్న బుల్‌డాగ్ కుక్కపిల్ల గోడవారగా బుట్టలో పడుకున్నది. దాని దగ్గర బొమికె ఉంచింది రుక్మిణి. యెవర్నేమనలేదు.

''కుక్కేం బావున్నదీ? కొన్నావా?'' అనడిగింది వాసంతి.

''కొనలేదు. అదే నా వెంటబడి వచ్చిందింటికి''.

''నీ వెంటబడి వచ్చే బోయ్ ఫ్రెండు లాగానా? టోపీ పూర్తయిందీ రుక్కూ. యెవరినెత్తిన పెడతావే ఆ కుచ్చుల టోపీ?'' అని నవ్వింది. యేదో తుంపి పోస్తుంది లేదా రెండు నాణేలు తాకిస్తూ చప్పుడు చేస్తుంది. వూగుతూ నవ్వుతూ వచ్చి టేబుల్ దగ్గర నిలబడింది.

'స్నేహితురాలు జ్యోతి తన యేడాది కొడుకు కోసం టోపీ మేజోళ్లు అల్లమని వూలు అల్లిక సూదులు యిచ్చి వెళ్లింది. తనకు టైం లేదుట. పార్ట్ టైమ్ గూడా చేస్తున్నదట. అల్లేశా. తానే వస్తానంటే డ్రాయర్లో వుంచా''.

''అన్నిటికీ తాళాలు వేస్తావేం? కుక్కకూ వేస్తావా?'' అన్నదికిలిస్తూ, వూగుతూ మీదకి వంగుతూ.

''తాళాలు పగల గొడతారా లేదా చూతావని'' అంటూ లేచి వెళ్లిపోయింది రుక్మిణి. దొడ్లో కెళ్లింది. పెద్దగా యీల వినబడింది. ''రాం. రాం'' అన్నివేపులా ఆశగా చూసింది రుక్మిణి జామ, గున్న మామిడి, బాదం చెట్టు, పూత పెట్టిన బంగినపల్లి, పాల సపోటా, గజ నిమ్మ, గెలవేసిన అరటి, కొబ్బరి చెట్లు. చేతులెత్తి పిలుస్తూ రమ్మని వూపింది. మైనా వచ్చి బుజం మీద వాలింది. యెంతో సంతోషం, రుక్మిణికి, దాని తలమీద, వంటి మీదా రాస్తూ ముద్దులాడింది. ఇంట్లోకి తెచ్చి ఖాళీ పంజరంలో వుంచి, ఆహారం పళ్లెం వుంచి

పంజారానికి తాళం వేసింది రుక్మిణి.

చిలక మెల్లిగా ''క్రోతి, క్రోతి'' అన్నది.

అక్కడే నిలబడి చూస్తున్న వాసంతి పకాపక నవ్వి, ''అలా అంటేనే గొంతు పిసికా'' అని వెళ్లి పంజరం కుదిలించింది.

వాకిట్లో సైకిలు కిందబడేసి మారుతీరావు లోపలికొచ్చాడు. కుక్కను గూడా తెచ్చావే రుక్కూ? నీ సొమ్ము మేము తింటామనా? నీ వెంటబడి వచ్చేవాడెవరూ? యేం కులం? ఇంట్లోకి రానిస్తున్నావా? వాడికి నా తడాఖా తెలియదేమో. యెంత వుద్యోగినివైనా ఆస్తిపాస్తులున్నా ఆడదానివే'' అంటూ దొడ్లో బావివేపు వెళ్లాడు. నీళ్లు తోడి నెత్తిన పోసుకుంటూ స్నానం చేయసాగాడు.

13

శిశిర వసంతౌ పునరాయాతః అన్నాడు కవి. చీకటి పోగా వెన్నెల రాదా మరియిక వేకువ కాదా అని పాడుతూ సాధు ముష్టి వేయించుకెళతాడు. అలాగా రుక్మిణి యిపుడు వన్ బెడ్‌రూమ్ ఫ్లాట్‌లో కూచుని దూరదర్శిని బుల్లి తెరవంక చూస్తున్నది. మిత్రుడు అజాద్ సైకిల్ మీద అద్భుతాలు చూపుతున్నాడు. పంజరంలో చిలక, మరో పంజరంలో మైనా. మూలగా సోఫాలో రగ్గు మధ్య కోతి కళ్లార్పుతూ తల మాత్రం చూపుతున్నది. మరో మూల పేము బుట్టలో బుల్ డాగ్. మెడలో పట్టీ. బెడ్ రూమ్‌లో దీపాల తోరణం. దీపాలు వెలిగాయి. వెలగనూ, మారనూ, రంగులు మారనూ, పూర్తిగా ఆరనూ మళ్లా తెల్లగా వెలగనూ డాన్సు చేయనూ చేస్తున్నాయి.

కాలింగ్ బెల్ వినబడింది. రెడ్ లైట్ వెలిగింది. రుక్మిణి లేచి వెళ్లి, తలుపు మధ్య వున్న అద్దంలోంచి చూసింది. తలుపు తీసింది. వాసంతి, అనుమాయమ్మ లోపలికొచ్చారు. తలుపు మూసింది రుక్మిణి. పంజాబీ డ్రెస్. బాబ్డ్ హెయిర్. పాదాలకి స్లిప్పర్సు. లోపల మోడరన్ ఫర్నిచరులో కూచున్నారు వచ్చిన వారు. కలియచూశారు. అద్దాల తలుపులున్న అల్మరులో చిన్నా పెద్దా, బొమ్మలు. మహమ్మద్ ప్రవక్త, జీసెస్ క్రీస్ట్, గురునానక్, చక్రాయుధుడు, తూలికా భూషణ్,

త్రినేత్రుడు, చతుర్ముఖుడు, లక్ష్మీ పార్వతి సరస్వతీ, అయ్యప్ప వెండి బొమ్మ, కోణార్కలో అమ్మిన బొమ్మలు, పీసా టవర్, యిఫిల్ టవర్, ఎంపైర్ బిల్డింగ్, హైయ్యెస్ట్ టవర్, గోడలకు బొమ్మలూ, చిత్రాలూ అతికించబడివున్నాయి. జాతీయ పిత, నేతాజీ, నెహ్రూ, పటేల్, శివాజీ, రుద్రమదేవి. శంకర భగవత్ పాదులు, ఝాన్సీ లక్ష్మీబాయి, సరోజినీ నాయుడు.

ఒక నెలల పాప పేము బుట్టలో దుప్పటి మధ్య వెచ్చగా కూచుని యేదో పలుకుతూ చేతులో బొమ్మతో ఆడుతున్నది. గౌను మెళ్లో గొలుసు. చేతులకి మురుగులు.

''కూతురా?'' అనడిగింది వాసంతి.

''కాదు. పక్క ఫ్లాట్‌లో వాళ్ల పాప. సినిమా కెళ్తూ యిక్కడుంచి వెళ్లారు. నాకు అలవాటైందని దించి వెళ్లారు''. అనుమాయమ్మ టైమ్ వేస్టు చేయకుండా నస మొదలెట్టింది. ''నీ దోవ నువ్వు చూసుకున్నావు. నేర్పుగా తప్పించుకొచ్చావు. తప్పు మా మీద కెక్కించావు. ఫ్లాటు కొనుక్కున్నానని మాట వరసకైనా మాకు తెలియనీయలేదు''.

వాసంతి, ''యెవరినీ సంప్రదించకుండానే ఫర్నిచరూ, పాత్రలూ కొనేశావే రుక్కూ? పోనీ తోడన్నా రమ్మన్నా లేదు. ఒంటెత్తు గుణం. మొదట్నించీ ఒంటిపిల్లి రాకాశివే'' అన్నది నవ్వుతూనే.

''క్రోతి, క్రోతి'' అనే చిలకపలుకులు, మైనా యీలా రాం. రాం. అనేవీ వినిపించాయి.

''నీ దత్తపుత్రుని కోసం వెతికించావా? మారుతన్నవాడి భరతం పట్టాడు. గెలవలేక వుడాయించాడు''.

''వెతికించలేదు. సూపర్ బజార్లో పనికి కుదిరాడు. ఫోన్ చేస్తే సరుకులు హోమ్ డెలివరీ చేస్తారా కిరాణా షాపువారు. ఫోన్ చేశా. సరుకులు ఫ్లాట్‌కి తెచ్చి లెక్కచూసి అప్పగిస్తే అప్పుడు చూశా'' అన్నది రుక్మిణి దూరదర్శన్ వంక చూస్తున్నది.

''మా మీదేం నేరాలు చెప్పలేదూ రాంబంటు?''

''చెప్పలేదు'' అన్నది ముక్తసరిగా.

రుక్మిణిలో చలనం లేదని గమనించిన అనుమాయమ్మ ప్రవోక్ చేసి హర్ట్ చేస్తే రెచ్చిపోతుందని దెప్పటం సాగించింది.

''మారుతన్నని మోటార్ సైకిల్‌తో ఢీకొని, వాడు పడిపోతే, వాడిని మోసుకెళ్లి సైకియాట్రిస్టు శంకర్ నర్సింగ్ హోమ్‌లో అడ్మిట్ చేసి వెళ్లిపోయాడు నీ విటుడు. అన్నకోసం వెతికి, ఫోనొచ్చాక వెళ్లి డిశ్చార్జ్ చేయించి యింటికి తెచ్చేప్పటికి నా తాతలు దిగొచ్చారు'' అన్నది.

''నా విటుడు బిల్లు చెల్లించాడు. నాతో చెప్పాడు'' అని రుక్మిణి లేచిపోయి తాళం తిప్పి డ్రాయర్ సొరుగు లాగి బిల్ చెల్లించిన రశీదు తల్లి కందించింది. కాలింగ్ బెల్ వినబడితే వాసంతి వెళ్లి తానూ తలుపుకి వున్న అద్దంలోంచి చూసి తలుపుతీసింది. సెకండ్ కజిన్ మీనాక్షీ సోమసుందరేశ్వరుడు లోపలికొచ్చాడు. టెన్నిస్ బంతి గోడకు కొట్టి అందుకుంటూ, రుక్మిణి వంక చూస్తూ, 'పెళ్లాడుదామనకుంటిమే రుక్కూ? యెవరికీ చెందకుండా అదృశ్యమై యిక్కడ వెలిశావా? అత్త దగ్గరే వుంటేసరిపోలా? టెలిఫోన్ డైరెక్టరీ వెతకాలా? ఇప్పుడైనా వస్తావా రావా తేల్చేయ్. నానుడు బేరం నా కసహ్యం'' అన్నాడు. పాతికేళ్ళు. చక్కగా డ్రెస్ చేసుకున్నాడు. అందమైన క్రాపూ. కళ్లజోడూ.

''రాను. మీ అన్నను చేసుకోమన్నావు. ''నిన్ను చేసుకుంటుందిట రుక్కు'' అని మీ అన్నతో అన్నావుట. ఇద్దర్నెలా పెళ్లాడుతానూ? చెరోవేపునా కూచుంటారా పెళ్లిలో'' అన్నది నవ్వుమొహంతో.

'' ఇటీజె గేమ్. అలా అన్నప్పుడు నీ మొహంలో రంగులెలా మారుతాయో చూద్దామని అన్నాను''.

''నిన్నే చేసుకుంటాను'' అని అంటావని ఆశించాను. అదేదో సంబంధం తిప్పేశావుటే. సింగిల్‌గా వుండాలని ఐడియా? వేరే మతస్తుడు గానీ, పంజాబీగానీ కావాలా?'' అంటూ నవ్వుతూ బంతాట సాగిస్తూ రుక్మిణి వంక చూస్తున్నాడు సుందరేశ్వరుడు.

రుక్మిణి మళ్లా లేచిపోయి డ్రాయరు సొరుగు లాగి ఒక వుత్తరం తెచ్చి బంతి ఆటగాని కిచ్చి, డ్రాయరు మూసి వచ్చి సోఫాలో కూచున్నది.

కాసేపు బంతాట ఆపి సుందరేశ్వరుడు వుత్తరం చదువుతుంటే, వాసంతీ, అనుమాయమ్మ కుతూహలంతో లేచివచ్చి తామూ చదవసాగారు.

''రుక్మిణీ దేవికి. మీ మొదటి కజిన్ లక్ష్మికాంతం నిన్ను గురించి చెప్పిన మాటలు నమ్మి ఆనాడు నేను, పెళ్ళి చూపులు కాన్సిల్ చేసి వెళ్లిపోయాను. చాలా విచారం వేసింది. తర్వాత త్వరలోనే నాకైతే ఒక గండ్రాగొండితో వివాహమైందిగానీ, సుఖశాంతులు కరవైనై. వంశోద్ధారకుడూ లేడు. వారసుడూ పుట్టలేదు. ఆడపిల్లలనే కన్నది. కవలలు. గండ్రాగొండి యిలా యెంతమంది ఆడపిల్లలను కవలలును డెలివర్ చేస్తుందోమోనని భయంగా వున్నది నా ఆస్తంతా ఆ ఆడపిల్లలకి పోయాల్సిన కట్నాలకి సరిపోవచ్చు. పెళ్లిచూపులకి రాని పెళ్లికొడుకు. తా.క. మీ బాబాయి అంజనేయులు అంతా సెటిల్ చేశానని చెప్పి ముందుగానే కమీషన్ లాగేశాడు''.

''క్రోతి, క్రోతి'' అనే అరుపు, పెద్ద యీలా రాం. రాం. అనేవీ వినిపించాయి. పాప చేతులూపుతూ బొమ్మ విసిరేసింది. బుల్‌డాగ్ తన బుట్టలోంచి దూకి వచ్చి పాప పక్కనున్న సంచీలోని ఫూప్సీని నోటితో భద్రంగా తీసి పాపకందించింది. పాప పాలు తాగి యిచ్చే దాకా యెదురుగా చూస్తూ కూచున్నది తలా చెవులూ ఆడిస్తున్నది. పాప పాలుతాగి ఫూప్సీ అందించగానే నోటితో అందుకుని బుట్టలో పడేస్తే పదకొండు నెలల పాప దాని తలకు తన మూతి ఆనించి నవ్వింది. బుల్‌డాగ్ వెళ్లి తన బుట్టలో సద్దుక్కూచున్నది.

చిలకా మైనా రెక్కలల్లార్చాయి. కోతి అరిటిపండు ఒలిచి తిని తొక్క పారేసింది. రాంబంటు వచ్చి తలుపు తీసి తొక్కచూసి వేస్టుపేపర్ బాస్కెట్లో పడేశాడు. యెడమచేతిలో వున్న ట్రే వేడిపానీయాలు, ఓపెన్ చేసిన పుల్లలేసిన కోలా సీసాలు వున్నవి తెచ్చి మధ్య బల్ల మీదుంచి, అందర్నీ చూసి నవ్వి వెళ్లి పోయాడు.

పుత్తరం బుట్టలోకి నలిపి విసిరి సుందరేశ్వరుడు సుందరంగా నవ్వుతూ, బంతాట సాగించి, ''యెప్పుడు ఫోన్ చేశా యివన్నీ తెమ్మనీ?'' అన్నాడు.

''విజిటర్సు వచ్చారని ఫోన్ చేసి వచ్చి కూచున్నా''.

అనుమాయమ్మ కాఫీ చప్పరిస్తూ అన్నది. ''మాక్కూడామరో ఫ్లాటు చూడు రుక్కూ యీ భవనంలోనే చూడు. నువ్వు వచ్చేస్తే ఖర్చులన్నీ మా నెత్తినెక్కినై. మీ అయ్య సంగతి నీకు తెలుసుగా! పేరుకి తగ్గట్టు తిండికి తిమ్మరాజు, పనికి పోతరాజూ. నువ్వంటే నచ్చచెప్పి పనిలో యిరికించేదానివి అవమానించారని పనిలోకి వెళ్లడం మానేశాడు మీ అయ్య. మరోటి చూసుకుందామనే ఆలోచనే లేదు''.

వాసంతి నవ్వుతూ శీతల పానీయం పీలుస్తూ అన్నది.

''నేనేమననులే రుక్కూ. బోయ్ ఫ్రెండ్‌తో నీ మీద చాడీలు చెప్పనులే. ఆ పెంకుటిల్లు కూలేట్టున్నది. యెప్పుడో ఆ సీలింగ్ నా నెత్తిన కుప్ప కూలుతుంది. కలప పుచ్చింది, చూపించినా నాన్నలో చలనం లేదు. పాపం నీ బోయ్ ఫ్రెండ్‌నీ నిన్నూ బాగా హర్ట్ చేశా. ''యిల్లు అయ్యవారి నట్టిల్లు లాగా చేస్తే యేం వండుకు తింటుందీ వాసంతీ? అన్నీ కొని తెచ్చి యెదురుగా షెల్ఫులో వుంచు రుక్కూ. దయా కరుణ మానవత్త్వం చూపాలి'' అని నీతో అంటే వెలవెల పోయావు. నువ్వన్నీ కొని తెచ్చి అమరుస్తుంటే తెలియలేదు నీ విలువ. నేను అన్నీ కొని తెచ్చి అమర్చలేను. వుద్యోగమే చేయలేకపోయాను. రాజీనామా యిచ్చా. బాసు సరసుడు. తనతో ఫ్లర్ట్ చేయాలిట. లోభీ, రోగీ, కోపిష్ఠి వానితో సరసమా అని మానేశా. అమ్మ పిల్లల కోసం వండి పడేస్తే, నేను కొంచెం తిని పడుకుంటా. చాకలి మానేశాడు. ఇంటినిండా విడిచిన గుడ్డలు'' అంటున్నది.

అనుమాయమ్మ కాఫీ పూర్తిచేసి కప్పూ సాసరూ బల్లమీదుంచి. ''నీ వేపు రాము. నిన్నేమీ అడగము. మా దోవన మేముంటాము పిల్లల చదువులు పూర్తికాగానే వాళ్లదోవ వాళ్లు చూసుకుంటారు'', అన్నది.

గోడ గడియారం టిక్‌టిక్‌మనటం గానీ టైంగానీ యెవరూ గమనించలేదు. తలుపులు తెరుచుకున్నాయి. పాపతల్లీతండ్రీ వచ్చి పాప నెత్తుకున్నారు. పాప చేయి వూపుతూ నవ్వింది. వాళ్లు వెళ్లారు. ఫ్లాటు యజమానీ భార్య వచ్చారు. నిలబడిపోయారు. భార్యపేరు సక్సేనా. చాలా పొడగరి. పొడుగాటి మొహం భర్తేమో ఆమె బుజం మీద చేయివేసి తానామె పక్షమేనని వెల్లడిస్తున్నాడు. ఆమె మాతృభాష తప్పితే మరే భాషా తిన్నగా రానట్టు పచ్చింగ్లీషు యితర భాషా పదాలతో కలిపి అరవసాగింది.

''వీరంతా యెవరు? మంద పోగుబడిందే, కోతులల్లే వున్నారే. ఒక్కత్తెవే వుంటావని కదూ యిల్లు నీకు స్వాధీనం చేసి వెళ్లిందీ నిన్ను చూసి ఆనెస్ట్ అనుకున్నామే. చూస్తే దగాకోరులాగా వున్నావు. ఈ ఖిలాడీ ఎవరు? ఈ క్షణాన యీ కోతులన్నీ నా యిల్లు వదిలెళ్లాలి. లేకపోతే నేనూ కోతిలాగా బిహేవ్ చేయల్సి వస్తుంది. మైండ్ యూ రూసీ. టెన్నిస్ ఇండోర్ గేమ్ కాదే'' అని అరుస్తూ గోడకు్కొట్టుకుని తిరిగి వచ్చే బంతి అందుకోబోతే, ఆమె మేకప్, ఆ గొంతు, ధాటీగా మాట్లాడటం విని చూసి ముందు నిష్క్రమించింది సుందరేశ్వరుడు. తరవాత తక్కినిద్దరూ నిష్క్రమించారు.

''క్రోతి క్రోతి. పెద్ద యీలా రాం రాం'' వినిపించాయి.

బుల్‌డాగ్ వారి వంక చూసింది. కోతి దుప్పట్లో దూరింది.

రుక్మిణి నవ్వు మొహంతో లేచి వచ్చి రుక్సానాని కావిలించుకుని ముద్దులు పెట్టి, యుహేవ్ గట్స్. యు ఆరె బ్రేవ్ వుమన్ థాంక్యూ'' అన్నది.

కథా నిలయం
55503
శ్రీకాకుళం